ఈనాడు ఆదిలాబాద్

శనివారం అక్టోబరు 26, 2024

ఉత్సాహంగా పోలీసుల సైకిల్ ర్యాలీ



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ గౌష్ ఆలం

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : విధి నిర్వహణలో తమ ప్రాణాలను త్యాగం చేసిన పోలీసు అమరులను స్మరించుకోవడానికే పట్టణంలో సైకిల్ ర్యాలీ నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ గౌష్ ఆలం పేర్కొన్నారు. 'పోలీసు అమర వీరుల వారోత్సవాల' నేపథ్యంలో వారి స్మారకార్థం శుక్రవారం పోలీసు హెడ్ క్వార్టర్ వద్ద సైకిల్ ర్యాలీని ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. పోలీసులు, పట్టణ ప్రముఖులు పలువురు పాల్గొన్నారు. ఏఎస్పీ బి.సురేందర్ రావు, డీఎస్పీలు శ్రీనివాస్, ఎల్.జీవన్‌రెడ్డి, హసీబ్‌ఉల్లా, సురేందర్‌రెడ్డి, సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్ ఖత్రి, తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : స్థానిక పోలీసు ఏఆర్ హెడ్‌క్వార్టర్‌లో శనివారం ఉదయం పది గంటలకు మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఎస్పీ గౌష్ ఆలం తెలిపారు. పోలీసు అమర వీరుల స్మారక వారోత్సవాల(ఫ్లాగ్‌డే)ను పురస్కరించుకొని ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. యువత స్వచ్ఛందంగా రావాలన్నారు.

పశుగణన పకడ్బందీగా నిర్వహించాలి

తలమడుగు, న్యూస్‌టుడే : పశుగణన కార్యక్రమాన్ని సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పశువైద్యాధికారి కిషన్ అన్నారు. శుక్రవారం తలమడుగు మండలం బరంపూర్‌లో ప్రాథమిక వ్యవసాయ సంఘం ఛైర్మన్ దామోదర్‌రెడ్డితో కలిసి పశుగణనను ప్రారంభించారు. పశువైద్యాధికారి లావణ్య, దూద్‌రామ్ రాఠోడ్, సౌమ్య, విజయ్, కేదారేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒక వైపు బెబ్బులి.. మరో వైపు గజరాజు





ఏప్రిల్ నెలలో కుమురం భీం జిల్లాకు వచ్చిన ఏనుగు

● ఉమ్మడి జిల్లావాసుల్ని వణికిస్తున్న మృగాలు


ఆవాసం కోసం, తోడు కోసం వెతుక్కుంటూ వస్తున్న పులులు సరైన గమ్యస్థానానికి చేరుకునే క్రమంలో అనేక అవరోధాలను ఎదుర్కొంటున్నాయి. ఈ మార్గంలో మనుషులకు కనిపించడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వ్యాఘ్రం లేదా మనిషి మృత్యువాతపడుతున్నారు. మరోవైపు ఏనుగు సైతం ప్రాణహిత నదిని దాటి కుమురం భీం జిల్లా సరిహద్దుల్లో సంచరిస్తుండటంతో సమీప గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ముగ్గురిని చంపేసిన ఏనుగు తెలంగాణలోకి వస్తే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. -ఈనాడు, ఆసిఫాబాద్

పులుల అభయారణ్యాల నుంచి..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కవ్వాల్ టైగర్ జోన్ విస్తరించి ఉండగా, వీటి చుట్టూ మహారాష్ట్రలోని తిప్పేశ్వర్, తడోబా, ఛత్తీస్‌గఢ్‌లోని ఇంద్రావతి అభయారణ్యాలు ఉన్నాయి. వీటిలో ఏటా 30-40 వరకు పులి పిల్లలు జన్మిస్తున్నాయి. ఆవాసం వెతుక్కునే క్రమంలో కుమురం భీం, మంచిర్యాల, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లా అడవులకు ఇవి వస్తున్నాయి. ఇలా వస్తున్నవి నేరుగా కవ్వాల్‌కు చేరుకోలేకపోతున్నాయి. నాలుగు వరుసల రహదారి, బొగ్గు ఉపరితల గనులు, పోడు వ్యవసాయం, ప్రాజెక్టుల నిర్మాణం వీటిని కవ్వాల్‌వైపు వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నాయి.

ఒకటి నిలకడగా ఉంది

కవ్వాల్ ఉడుంపూర్ అటవీ ప్రాంతంలో ఒక పులి నివాసం ఏర్పర్చుకోవడం పట్ల అటవీ అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కెరమెరి మండలంలోని ఇందాపూర్ అటవీ ప్రాంతంలో ఆడ పులి సంచరిస్తుంది. పక్షం రోజుల్లో రెండు ఆవులను ఈ పులి చంపేసింది. ఈ పులి కవ్వాల్‌కు వెళితే జతకట్టే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. తిప్పేశ్వర్ నుంచి వచ్చిన మగపులి భీంపూర్, బోథ్, సారంగపూర్ మీదుగా కవ్వాల్‌కు చేరుకుంటుందా లేదా అని కొద్ది రోజుల్లో తెలిపోతుంది. .



ఏనుగు కదలికలపై అప్రమత్తంగా ఉన్నాం

నీరజ్‌కుమార్, కుమురంభీం జిల్లా అటవీ శాఖ అధికారి

ప్రాణహిత నది సమీపంలో తెలంగాణ చింతలమానేపల్లి మండల అటవీ ప్రాంతానికి 30-35 కిలోమీటర్ల దూరంలో ఏనుగు సంచరిస్తోంది. డ్రోన్ కెమెరాలతో ఈ ఏనుగును నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ప్రాణహిత నదీ తీరం వెంబడి ఉన్న బెజ్జూర్, చింతలమానేపల్లి, పెంచికల్‌పేట్ మండలాల ఆయా గ్రామాల ప్రజలు రాత్రి ఆరు గంటల అనంతరం ఎవరు పంటచేల వద్దకు వెళ్లవద్దు.

✸ ఈ ఏడాది ఏప్రిల్‌లో కుమురం భీం జిల్లాకు వచ్చిన ఏనుగు పెంచికల్‌పేట్, చింతలమానేపల్లి మండలాల్లో ఇద్దరు రైతులను తొక్కి చంపేసింది. రెండు రోజుల అనంతరం ప్రాణహిత నదిని దాటి మహారాష్ట్ర జిల్లాలోని గడ్చిరోలి అడవులకు వెళ్లింది. ఈ ఏనుగు మహారాష్ట్రలోనే ఉన్నా, ప్రస్తుతం తెలంగాణలోని చింతలమానేపల్లి, బెజ్జూర్ మండలాల వైపు వస్తుందని అటవీ అధికారులకు పొరుగు రాష్ట్ర అధికారులు సమాచారం అందించారు. వారం క్రితం గడ్చిరోలి జిల్లాలో ఓ యువకుడు ఏనుగుతో సెల్ఫీ తీసుకునే క్రమంలో సైతం ఇదే ఏనుగు తొక్కి చంపేసింది.

జత కోసం వెతుకులాట..

న్యూస్‌టుడే, బోథ్ :

ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలో మూడు రోజులుగా తిరుగుతున్న పెద్దపులి.. గురువారం సాయంత్రం నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలో ప్రత్యక్షమైంది. పశువులపై దాడిచేసి చంపుతుండటంతో రెండు మండలాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అటవీ సిబ్బందికి నాలుగు రోజులుగా కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. దాదాపు 20 మంది బేస్ క్యాంపు సిబ్బంది పులి జాడ కోసం అడవిని జల్లెడ పడుతున్నారు. ఇది మగ పులిగా అటవీ సిబ్బంది నిర్ధారించారు. ప్రతి ఏడాదిలాగే ఈ సంవత్సరం సైతం తన తోడును వెతుక్కుంటూ మహారాష్ట్ర నుంచి బోథ్ ప్రాంతంలోని అటవీ ప్రాంతంలోకి వచ్చిందని భావిస్తున్నారు. తోడును వెతుక్కునే క్రమంలో కంటికి కనిపించిన పశువులపై కోపంతో దాడి చేసి చంపుతోంది. బుధవారం చింతగూడ అటవీ ప్రాంతంలో ఎద్దుపై దాడి చేసి చంపింది. కానీ మాంసాన్ని మాత్రం తినలేదు.

తిప్పేశ్వర్ నుంచి..

-పుండలిక్, ఇన్‌ఛార్జి ఎఫ్ఆర్వో, బోథ్

బోథ్ మండలం వజ్జర్, చింతగూడ అటవీ ప్రాంతంలో వ్యాఘ్రం సంచరిస్తుందనే మాట వాస్తవమే. రెండు రోజులుగా పులి కదలికలను గమనించాం. తిప్పేశ్వర్ అటవీ ప్రాంతం నుంచి భీంపూర్ మీదుగా బోథ్ మండలంలోని వజ్జర్ అటవీ ప్రాంతానికి వచ్చింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అటవీ ప్రాంతానికి వెళ్లొద్దు. పశువులను తీసుకెళ్లొద్దు.

చేతిపంపు నీరే గతి



చేతిపంపు వద్ద స్నానాలు చేస్తున్న విద్యార్థులు

చేతిపంపు వద్ద స్నానాలు చేస్తున్నది సిరికొండ మండలం రాయిగూడ బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులు. ఇక్కడ 300 మంది విద్యనభ్యసిస్తున్నారు. వేడి నీటి కోసం ఏర్పాటు చేసిన సౌర పరికరాలు పని చేయక చన్నీటితో స్నానాలు చేస్తున్నారు.

సౌకర్యాలు కరవు.. చన్నీటి స్నానమే దిక్కు!

● వసతిగృహాల్లో వణికించే చలిలో విద్యార్థుల వెతలు

రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు జిల్లాలో నమోదవుతాయి. చలికాలం వచ్చిందంటే చాలు వసతిగృహాల్లో ఉండే విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారు. కనీస సౌకర్యాలు లేక తల్లడిల్లుతున్నారు. సౌర వేడి నీటి యంత్రాలు లేక చన్నీటి స్నానాలు చేసి అనారోగ్యాలకు గురవుతున్నారు. మరోవైపు కిటికీలకు తలుపులు లేక పరదాలే దిక్కవుతున్నాయి. -న్యూస్‌టుడే, ఇచ్చోడ

పరిశీలన



అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థులకు కట్టెల పొయ్యిపై నీరు వేడి చేస్తూ..

తాంసి గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో 122మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పడుకునేందుకు సరిపడా గదులు లేక తరగతి గదుల్లోనే నిద్రిస్తున్నారు. రెండేళ్ల కిందట ప్రారంభమైన అదనపు గదులు ఇంకా పూర్తి కాలేదు. కిటికీలకు తలుపులు లేవు. వేడి నీటి కోసం సౌర పరికరాలు లేక చన్నీటి స్నానాలే దిక్కవుతున్నాయి. జ్వరం, ఇతర చర్మ వ్యాధులు ఉన్నవారికి అక్కడ ఉన్న వార్డెన్ హరీశ్ తప్పని పరిస్థితిలో కట్టెల పొయ్యిపై వేడి నీటిని అందిస్తున్నారు.



తలుపులు లేని కిటికీలు

జిల్లాలో ఆశ్రమ పాఠశాలలు : 54
విద్యార్థులు : 19 వేలు

అనారోగ్యాల బారిన పడుతూ..

ఉట్నూరు మండలం నర్సాపూర్(బి)లో బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సౌర పరికరాలు పని చేయడం లేదు. చన్నీటితోనే విద్యార్థులు స్నానాలు చేసి, అనారోగ్యం బారిన పడుతున్నారు. వాటిని బాగు చేయాలని కోరుతున్నా పట్టించుకునే వారు లేరు.



నిరుపయోగంగా సౌర పరికరాలు

బోనస్ ప్రకటించాలి



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : తేమశాతంతో రైతులు నష్టపోకుండా వరికి బోనస్ ఇస్తున్నట్లుగానే పత్తి రైతులకు బోనస్ ఇచ్చి ఆదుకోవాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ఆయన నేరుగా శుక్రవారం రాత్రి వ్యవసాయ మార్కెట్‌యార్డుకు చేరుకుని రైతులతో మాట్లాడారు. పాయల్ ఫౌండేషన్ తరఫున రైతులకు, వాహనదారులకు భోజన వసతి కల్పించారు.

భారాస హయాంలో రైతులకు సంకెళ్లు : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జు

ఉట్నూరు, న్యూస్‌టుడే : కేటీఆర్ ఆదిలాబాద్‌కు వచ్చి దారుణంగా మాట్లాడారని, భారాస పాలనలో రైతులకు సంకెళ్లు వేయించి జైలుకు పంపినది మరిచిపోయారా అంటూ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ధ్వజమెత్తారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ ముగ్గురు కలిసి బడుగు బలహీన వర్గాలను దోచుకున్నారన్నారు. శుక్రవారం ఉట్నూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దొరలు, భూస్వాములకు రైతుబంధు పేరిట డబ్బులు పంచి పెట్టారని ఆక్షేపించారు. రైతు రుణమాఫీ కాలేదని కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అంటూ సవాలు విసిరారు. నాయకులు చంద్రయ్య, ఎక్బాల్, ఖయ్యుం, తిరుపతి, రాజేశ్వర్, అజీముద్దీన్, రాహుల్, శివాజీ, శ్రీరాంలు పాల్గొన్నారు.



బల్దియా అధికారులతో సివిల్స్ శిక్షణ అధికారుల బృందం

బల్దియా పాలనపై అవగాహన

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : జిల్లాకు వచ్చిన సివిల్స్ శిక్షణ అధికారుల బృందం శుక్రవారం బల్దియా కార్యాలయాన్ని సందర్శించింది. ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూ, మెప్మా, పారిశుద్ధ్య విభాగాల పనితీరు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల కింద బల్దియాకు మంజూరు చేసిన నిధుల వివరాలు, పనుల పురోగతిని డీఈఈ తిరుపతి అధికారులకు వివరించారు. సివిల్స్ శిక్షణ అధికారులు శనివారం బల్దియా వార్డుల్లో క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారని పేర్కొన్నారు. ఆర్ఓ జాదవ్‌కృష్ణ, శానిటరీ సూపర్‌వైజర్ సాజిద్ అలీ, టీపీఓ సుమలత, టీపీఎస్ నవీన్ కుమార్ సిబ్బంది ఉన్నారు.

ఔషధాల సరఫరా తీరును మెరుగుపరుస్తాం

ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే : పీహెచ్‌సీల్లో ఔషధాల కొరత ఉన్నట్లు వస్తున్న సమాచారం మేరకు అలాంటి పరిస్థితులు లేకుండా సరఫరా విధానాన్ని క్రమబద్ధీకరించనున్నట్లు ఆరోగ్య శాఖ కమిషనర్ కార్యాలయ చీఫ్ ఇన్‌ఫర్మేషన్ అధికారి(సీఐఓ) మంజునాథ్ తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు టాస్క్‌ఫోర్సు అధికారిగా నియమితులైన ఆయన శుక్రవారం జిల్లాకు వచ్చారు. డీఎంహెచ్‌ఓ కృష్ణ, డీటీటీ పీవో రాఠోడ్ నరేందర్‌తో కలిసి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్‌ను పరిశీలించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయ గణాంకాధికారి బ్రహ్మానందరెడ్డి ఉన్నారు.

పత్తి కొనుగోళ్లలో ప్రతిష్టంభన

● రోజంతా అన్నదాతల ఆందోళన
● తేమ విషయంలో గొడవ

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం :

ఆదిలాబాద్ జిల్లా చరిత్రలోనే పత్తి కొనుగోళ్ల ప్రారంభం రోజునే ప్రతిష్టంభన నెలకొనడం ఇదే తొలిసారి. తేమను సాకుగా చూపి ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ, వ్యాపారులు కొనుగోళ్లకు ముందుకు రాలేదు. సీసీఐ నిబంధనలు, వ్యాపారులు ప్రకటించిన ధర పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తేమను పరిగణనలోకి తీసుకోకుండా కొనుగోలు చేయాలని పట్టుబట్టారు. శుక్రవారం ఉదయం పది గంటలకు ప్రారంభం కావాల్సిన కొనుగోళ్లు అసలు మొదలేకాలేదు. రైతులు, వ్యాపారులతో కలెక్టర్ రాజర్షిషా, మార్కెట్ జేడీ శ్రీనివాస్, తదితరులు జరిపిన చర్చలు కొలిక్కిరాలేదు. ఆగ్రహంతో అన్నదాతలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఫలితంగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. ఉదయం నుంచి రాత్రి వరకు మార్కెట్‌లో జరిగిన పరిణామాలు ఇలా ఉన్నాయి.

ఉదయం 10 గంటలు



పత్తి వేలం నిర్వహిస్తున్న వ్యాపారులు

మార్కెట్‌లో ఉదయం 10 గంటలకు పత్తి వేలం ప్రారంభమైంది. సీసీఐ నిబంధనల మేరకు 8 నుంచి 12 శాతం తేమ లోపు ఉన్న పత్తిని మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని కలెక్టర్ రాజర్షిషా ప్రకటించారు. తర్వాత వ్యాపారులు వేలంలో క్వింటాలుకు రూ.6,500 ధరను ప్రకటించారు. రూ.50, రూ.100 పెంచుతూ చివరికి క్వింటాలు పత్తికి రూ.7,150తో కొనుగోలు చేస్తామని వేలం ముగించారు. దీనికి రైతులు ఒప్పుకోలేదు. తేమ నిబంధన లేకుండా సీసీఐ మద్దతు ధరతో పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలా పత్తిని కొనుగోలు చేయడం కుదరదని సీసీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఆద్య మిశ్రా స్పష్టం చేయడంతో రైతులు వాగ్వాదానికి దిగారు. కలెక్టర్ రైతులకు నచ్చజెప్పి ముందుగా కొనుగోళ్లు ప్రారంభిద్దామంటూ కాంటా దగ్గరికి తీసుకెళ్లారు.



తేమను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, రైతులు

ఉదయం 11 గంటలు..

మార్కెట్‌లో పత్తి బళ్లు తూకం వేసే కాంటా దగ్గర పత్తి విక్రయాలు ప్రారంభించారు. ఇంతలో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అక్కడికి చేరుకొని, రైతులతో మాట్లాడారు. అనంతరం అక్కడున్న పత్తి వాహనంలో తేమ శాతాన్ని పరిశీలించగా, 20కిపైగా వచ్చింది. పలు చోట్ల తేమను పరిశీలిస్తే ఒక్కో చోట ఒక్కో తీరుగా వచ్చింది. సీసీఐ నిబంధనల మేరకు పత్తిలో తేమ రాదని, తేమను పరిగణనలోకి తీసుకోకుండా కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. పత్తి కొనుగోళ్లు ప్రారంభించేందుకు సిద్ధం కాగా.. ధర, తేమ విషయం తేలేదాకా కొనేది లేదని కాంటాపై బైఠాయించారు. తిరిగి రైతులతో మార్కెట్‌లోనే రెండు గంటలకు పైగా చర్చించినా.. సఫలం కాలేదు

మధ్యాహ్నం ఒంటి గంట :



మార్కెట్‌లో బైఠాయించిన రైతులు

ధర విషయంలో వ్యాపారులతో చర్చించేందుకు కలెక్టర్ మార్కెట్‌యార్డులో తిరిగి సమావేశమయ్యారు. రైతులకు మద్దతుగా తేమను పరిగణనలోకి తీసుకోకుండా ధర పెంచి కొనుగోలు చేయాలని వ్యాపారులను కోరారు. రాష్ట్రం మొత్తంలో క్వింటాలుకు రూ.7 వేలకు మించి ధర లేదని వ్యాపారులు చెప్పడంతో రైతుల కోసం ధర పెంచాలని కలెక్టర్ కోరడంతో రూ.50 పెంచి చివరగా క్వింటాలుకు రూ.7,200 ప్రకటించారు. ఇదే విషయాన్ని రైతులకు తెలియజేసి, కొనుగోళ్లు ప్రారంభించాలని ఆదేశించారు. ధరకు ఒప్పుకొన్న రైతులు తేమను పరిగణనలోకి తీసుకోకుండా కొనుగోలు చేయాలంటూ కలెక్టర్ కారు ముందు బైఠాయించారు. తమ సమస్య పరిష్కరించే వరకు ఇక్కడి నుంచి వెళ్లొద్దని రైతులు ప్రాధేయపడటంతో కలెక్టర్ అక్కడే ఉండిపోయారు.

మధ్యాహ్నం 3 :

ధర, తేమ విషయం ఎటూ తేలక రైతులు గుంపుగా మార్కెట్ రోడ్డుపై కూర్చొని నిరసన తెలిపారు. తాంసి, తలమడుగు వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. అక్కడ గంట సేపు నిరసన తెలిపి.. తిరిగి ప్రధాన రోడ్డు వైపు వెళ్లి కిసాన్‌చౌక్ రోడ్డుపై బైఠాయించారు. మరో వైపు జిల్లా కలెక్టర్‌తో పాటు అప్పుడే అక్కడికి చేరుకున్న ఎస్పీ ఆలం గౌష్‌లు తిరిగి వ్యాపారులను పిలిపించి మార్కెట్‌లో సమావేశమయ్యారు. సాయంత్రం ఆరు దాటినా కొనుగోళ్ల విషయం తేలక ఇటు అధికారులు, అటు రైతులు నీళ్లు భోజనాలు లేక అల్లాడిపోయారు.



కిసాన్‌చౌక్‌లో రాస్తారోకో

రాత్రి 9 గంటలు :

కలెక్టర్ తేమతో సంబంధం లేకుండా ధర ప్రకటించి కొనుగోలు చేయాలని వ్యాపారులను కోరడంతో చివరికి క్వింటాలుకు రూ.6,696 చొప్పున కొనుగోలు చేసేందుకు అంగీకరించారు. దీనిపై రైతుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. పత్తి వివాదం గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్ రాత్రి మార్కెట్‌కు చేరుకొని రైతులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. చివరికి అధికారులు, ప్రజాప్రతినిధులు వెళ్లిపోవడంతో రైతులు రాత్రంతా అక్కడే పడిగాపులు కాయాల్సి వచ్చింది.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)

ఆదిలాబాద్: 91541 18155
ఇచ్చోడ: 94935 57309
బోథ్: 91548 46671
ఉట్నూరు: 94410 86640

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ అర్బన్

? ఆదిలాబాద్ పట్టణంలోని దస్నాపూర్‌లో ఇళ్లు నిర్మించుకునే వారు శిథిలాలను రోడ్డుపైనే పడేస్తుండడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. - **వేణుగోపాల్‌రెడ్డి, వ్యాపారి**

✔ తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - **నరేందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**
మేమున్నాం మీకు తోడుగా

న్యూస్‌టుడే, ఇచ్చోడ :

? ఇచ్చోడలోని రంజాన్‌పుర కాలనీలో డ్రైనేజీలు లేక మురుగు నిలిచి కంపుకొడుతోంది. - **స్థానికుడు, ఇచ్చోడ**

✔ పరిశీలించి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. - **సూర్యప్రకాష్, పంచాయతీ ఈఓ**

శుభ్రం చేసి.. ఉపయోగంలోకి తెచ్చి

వందనం



ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో మరుగుదొడ్లు, మూత్రశాలలు అధ్వానంగా మారాయి. సాధకులు పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ 'ఈనాడు'లో 'కంపు కొడుతున్నా.. పట్టింపు కరవు' శీర్షికతో చిత్ర వార్తను ప్రచురితం చేసింది. స్పందించిన క్రీడా ప్రాధికారిక సంస్థ సిబ్బంది శుక్రవారం ప్రాంగణంలో ఉన్న మరుగుదొడ్లు, మూత్రశాలల గదులను శుభ్రం చేసి వాటిని ఉపయోగంలోకి తెచ్చారు.

- ఈనాడు, ఆదిలాబాద్, - న్యూస్‌టుడే, ఆదిలాబాద్ క్రీడావిభాగం

ఆర్‌ఎంపీ వైద్యుడి బలవన్మరణం


ఆనంద్

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : భీంపూర్ మండలం ధనోరాకు చెందిన అక్కినపెల్లి ఆనంద్(35) శుక్రవారం బట్టిసావర్‌గాం వద్ద పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మావల ఎస్‌ఐ విష్ణువర్ధన్ వివరాల మేరకు.. ఆనంద్ ఆర్‌ఎంపీ వైద్యుడిగా పని చేస్తుంటారు. శుక్రవారం ఉదయం భార్య ఆయనతో గొడవ పడి వెళ్లిపోయింది. అనంతరం ఆదిలాబాద్ వెళ్తున్నానని చెప్పి బయలుదేరాడు. బట్టిసావర్‌గాం వద్ద పురుగు మందు తాగి మృతి చెందాడు. అతడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య, ఆమె అన్నదమ్ముల వేధింపులతో వల్లనే ఆత్మహత్య చేసుకున్నట్లు తండ్రి తులసీరాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

గుడిహత్నూర్, న్యూస్‌టుడే : మండలంలోని జాతీయ రహదారి డొంగర్‌గాంవ్ సమీపంలో శుక్రవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు గుడిహత్నూర్ ఎస్సై ఇమ్రాన్ తెలిపారు. ఇంద్రవెల్లి మండలం గిన్నెరకు చెందిన రాథోడ్ కైలాస్(40) మండలంలోని ఒకరి వద్ద పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం తమ బంధువుల ఇంటికి వెళ్తుండగా ఆదిలాబాద్ నుంచి ఇచ్చోడ వైపు వెళ్తున్న బొలెరో వాహనం అతి వేగంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

గుండెపోటుతో ఉపాధి క్షేత్ర సహాయకుడు..

సొనాల(బోథ్), న్యూస్‌టుడే : గుండెపోటుతో ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు మృతి చెందాడు. బోథ్ మండలం మహదుగూడ పరిధిలో ఉపాధి హామీలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నాగుగూడకు చెందిన సోయం గంగారాం(45) వారం కిందట అనారోగ్యానికి గురయ్యాడు. హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో వారం రోజులుగా చికిత్స పొందుతున్నాడు. కుటుంబ సభ్యులు గురువారం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందాడు. అతడికి భార్య, ఓ కుమారుడు, కూతురు ఉన్నారు. ఆయన మాజీ ఎంపీ సోయం బాపురావు అన్న కమ్ము పెద్ద కుమారుడు.


సోయం గంగారాం

ఇల్లు దగ్ధం

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : ఇంద్రవెల్లి మండలం వడ్‌గాంలో పెందూర్ లక్ష్మణ్ ఇంట్లో భోగి పండగ పూజల కోసం దేవుడి వద్ద దీపం వెలిగించారు. ఎలుకలు దీపాన్ని పడేయడంతో దుస్తులు, ఫర్నిచర్ కాలిపోయినట్లు మెస్రం సీతారాం తెలిపారు. తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు సమాచారం ఇవ్వడంతో ఎంఆర్ఐ మెస్రం లక్ష్మణ్ ఇంటిని పరిశీలించారు.

వసుధ ఫౌండేషన్ ఆర్థిక సాయం

బోథ్, న్యూస్‌టుడే : బోథ్ మండలం ధన్నూర్‌కు చెందిన బద్దం సాయికిరణ్‌రెడ్డి కిడ్నీ సంబంధిత వ్యాధితో కొద్ది కాలంగా బాధపడుతున్నాడు. శుక్రవారం టీయూటీఎఫ్ సహకారంతో వసుధ ఫౌండేషన్ సభ్యులు బాధితుడికి రూ.10,000 ఆర్థికసాయం అందజేశారు. ఫౌండేషన్ ఛైర్మన్ వెంకటరామరాజు, సభ్యుడు భూపతిరెడ్డిలను గ్రామస్థులు అభినందించారు. వసుధ ఫౌండేషన్, టీయూటీఎఫ్, రెడ్డి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎకరానికి రూ.40 లక్షల పరిహారం చెల్లించాలి

ఆదిలాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే : రేణుక సిమెంటు పరిశ్రమ కోసం భూములు కోల్పోతున్న నిర్వాసితులకు ఎకరానికి రూ.40 లక్షల పరిహారంతో పాటు ఉద్యోగ అవకాశం కల్పించాలని, సాత్నాల ఎడమ కాలువ ద్వారా రైతులకు సాగు నీరు అందించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.వెంకట్రాములు డిమాండ్ చేశారు. యాపల్‌గూడలో నిర్వహించిన సీపీఎం ఏరియా మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పూసం సచిన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల విధులపై అవగాహన



తుపాకీ పని తీరును వివరిస్తున్న పోలీసు అధికారి, చిత్రంలో ఎస్పీ

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు 24 గంటల పాటు పోలీసులు నిర్వహించే విధులు, వినియోగించే తుపాకులు, ఇతరత్రా వివరాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించటానికే 'ఓపెన్ హౌజ్' కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఎస్పీ గౌష్ ఆలం పేర్కొన్నారు. స్థానిక ఏఆర్ హెడ్‌క్వార్టర్‌లో ఎస్పీ ఆధ్వర్యంలో 'పోలీసు అమర వీరుల వారోత్సవా'లను పురస్కరించుకొని శుక్రవారం నిర్వహించిన ఆన్‌లైన్ ఓపెన్‌హౌజ్ కార్యక్రమాన్ని జిల్లాలోని 75 పాఠశాలల విద్యార్థులు వీక్షించారు. అదనపు ఎస్పీ సురేందర్‌రావు, డీఎస్పీలు బి.సురేందర్‌రెడ్డి, హసీబ్‌ఉల్లా, సీఐలు బి.ప్రసాద్, డి.వెంకటి, టి.మురళి, చంద్రశేఖర్, కార్తిక్, కమ్యూనికేషన్ ఎస్ఐ గణేష్, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించాలి

జైనథ్, న్యూస్‌టుడే : మధ్యాహ్న భోజన కార్మికులకు (ఎండీఎం) చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యులు కుంటాల రాములు డిమాండ్ చేశారు. జైనథ్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి శుక్రవారం నిరసన తెలిపారు. తహసీల్దార్ శ్యాంసుందర్‌కు వినతిపత్రం అందజేశారు. వెంకటమ్మ, సుజాత, శోభ, గంగమ్మ, నాందేవ్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.


తలమడుగులో :


బోథ్‌లో..


సిరికొండలో..

కాంగ్రెస్ నాయకుల ఆందోళన


గుడిహత్నూర్‌లో..


బేలలో..

ఆదిలాబాద్ అర్బన్, ఇచ్చోడ, బోథ్, జైనథ్, సిరికొండ, తలమడుగు, గుడిహత్నూర్, బేల, న్యూస్‌టుడే : రాష్ట్రంలో కుటుంబ పాలన పోయి ప్రజాపాలన వచ్చిందనే అక్కసుతో కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. భారాస పోరుబాట సభలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా కేటీఆర్ ఫ్లెక్సీలను దహనం చేశారు.


ఆదిలాబాద్ : కేటీఆర్ ఫ్లెక్సీని దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



జైనథ్‌లో..

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 90వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఎస్.శ్రీజ, పి.విఘ్నేశ్వరీలు ప్రతిభకనపర్చారు. కళాశాలస్థాయిలో ఎంపికైన వారిద్దరూ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డా.అతిక్‌బేగం పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపల్ రఘు గణపతి, అధ్యాపకులు కృనాల్, సౌజన్య, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆలస్యంగా చేపపిల్లల విడుదల : ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

తాంసి, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆలస్యంగా చేపలు పట్టే సమయంలో చేప పిల్లలను విడుదల చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మత్తడివాగు ప్రాజెక్టులో వంద శాతం రాయితీపై 60 వేల చేప పిల్లలను విడుదల చేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 1.23 కోట్ల పిల్లలను వదిలితే ఈ ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వం 60 లక్షలు మాత్రమే విడుదల చేస్తోందన్నారు. డిప్యూటీ డైరెక్టర్ హన్మంత్‌రావు, ఏడీఏ సాంబశివ్ ఎమ్మెల్యేను సన్మానించారు. ఎంపీడీవో మోహన్‌రెడ్డి, నాయకులు వినోద్‌రెడ్డి, కృష్ణ, కిరణ్ కుమార్, రమణ, రఘు, శ్రీనివాస్, అశోక్, మహేందర్, వెంకట్‌రెడ్డి, నాగరెడ్డి, రజనీకాంత్‌రెడ్డి, వెంకటేష్, శంకర్ తదితరులున్నారు.


మత్తడివాగు ప్రాజెక్టులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

లాభసాటి సాగుపై దృష్టి సారించాలి


కాంటాకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

గుడిహత్నూర్, న్యూస్‌టుడే : రైతులు సంప్రదాయ పంటలపై కాకుండా లాభసాటి సాగుపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని మన్నూరు పంచాయతీ రాణి కాటన్ మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సహకార సంఘం ఛైర్మన్ సంజీవ్ ముండే, ఇచ్చోడ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ తిరుమల్‌గౌడ్, నాయకులు రమేశ్ జాదవ్, మాధవ్, రాము షిండే, సుధాకర్, భగవత్, రాందాస్, గజానన్, సీసీఐ అధికారి గణేశ్ సోనులే తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభం రోజే రైతులను దగా చేశారు: సీపీఎం

ఎదులాపురం, న్యూస్‌టుడే : పత్తి కొనుగోళ్లు ప్రారంభం రోజే రైతులను దగా చేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ ఆరోపించారు. తేమ 20 శాతంగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు.

కుమురం భీం విగ్రహావిష్కరణ

సిరికొండ, న్యూస్‌టుడే : జల్ జంగల్ జమీన్ కోసం తన ప్రాణాలను అర్పించిన ఆదివాసీ యోధుడు కుమురం భీం అని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం సిరికొండ మండలం రాయిగూడలో భీం విగ్రహావిష్కరణ కార్యక్రమంలో భాగంగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యురాలు నీలాదేవి, నాయకులు ఉన్నారు.


సొనాలలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న భారాస నాయకులు


తలమడుగులో..


గుడిహత్నూర్‌లో..

భారాస నేతల నిరసన

సొనాల(బోథ్), తలమడుగు, గుడిహత్నూర్, న్యూస్‌టుడే : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏమయ్యాయని భారాస నాయకులు ప్రశ్నించారు. ఆదిలాబాద్ రైతు పోరు బాట సభలో కేటీఆర్ ఉన్నది ఉన్నట్లు మాట్లాడితే కాంగ్రెస్ నేతలు తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన తెలిపారు. ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని విమర్శించారు.

దండారీ సందడి

ఇచ్చోడ, ఉట్నూరు గ్రామీణం, ఇంద్రవెల్లి : ఆదివాసీ పల్లెల్లో దండారీ సందడి మొదలైంది. సంప్రదాయ వాయిద్యాలకు, గుస్సాడీ టోపీలకు పూజలు చేశారు. గుస్సాడీ వేషధారణలతో యువకులు నృత్యం చేశారు. ఏత్మాసూర్ దేవతకు నైవేద్యం సమర్పించారు. సామూహిక భోజనాలు చేశారు. గుస్సాడీలను ఒక్కో పల్లె వారు పిలిచి ఆతిథ్యం ఇస్తారు.

కుమురం సూరు ఆశయ సాధనకు కృషి


నివాళులర్పిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా

ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే : టైగర్ జోన్‌తో నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడుతోందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శుక్రవారం ఉట్నూరు మండలం కొలాంగూడలో కుమురం సూరు వర్ధంతిని నిర్వహించారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, మహిళ కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి, భాజపా నాయకుడు రితేష్ రాథోడ్, పీవీటీజీ ఏపీవో మనోహర్, మాజీ ఎంపీపీ జైవంత్‌రావు హాజరయ్యారు. ఆదివాసీలు సూరు ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. నిర్వహణ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

నార్నూర్ (గాదిగూడ): కుమురం సూరు ఆశయ సాధనకు కృషి చేయాలని ఆదిమ గిరిజన కోలాం సంఘం మహిళ జిల్లా అధ్యక్షురాలు తుక్కుబాయి అన్నారు. సూరు వర్ధంతి సందర్భంగా జెండా ఆవిష్కరించి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ముగిసిన క్రీడోత్సవాలు


ఓవరాల్ ఛాంపియన్‌షిప్ కప్ అందుకుంటున్న మందమర్రి గురుకులం బాలికలు

ఆదిలాబాద్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపులే గురుకుల పాఠశాల, కళాశాలలో మూడ్రోజులుగా నిర్వహిస్తున్న అండర్-17 ఏళ్ల విభాగం గురుకులాల క్రీడోత్సవాలు శుక్రవారం సాయంత్రం ముగిశాయి. ఓవరాల్ ఛాంపియన్‌షిప్ మందమర్రి గురుకులం కైవసం చేసుకుంది. కబడ్డీలో గన్నారం, ఖోఖోలో మందమర్రి, వాలీబాల్‌లో ఆదిలాబాద్ గురుకులాలు విజేతలుగా నిలిచాయి. వ్యక్తిగత ఓవరాల్ ఛాంపియన్ కె.మౌనిక(గన్నారం) ఎంపికైంది. ఆదిలాబాద్, జైనథ్, ఆసిఫాబాద్ గురుకులాల ప్రిన్సిపాళ్లు కీర్తి, ఉమాదేవి, రత్నాబాయి ఉన్నారు.

సిద్దిపేటకు బల్దియా బృందం


బయోగ్యాస్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న పుర కమిషనర్ ఎండీ ఖమర్ అహ్మద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నరేందర్, శంకర్

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : సిద్దిపేట ఆదర్శ మున్సిపాలిటీని శుక్రవారం ఆదిలాబాద్ బల్దియా అధికారుల బృందం సందర్శించింది. పుర కమిషనర్ ఎండీ ఖమర్ ఆధ్వర్యంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నరేందర్, శంకర్, పర్యావరణ ఇంజినీరు అవికిరణ్ ప్రగతి పనులను పరిశీలించారు. ఇంటింటా చెత్త సేకరణ, ఘన వ్యర్థాల నిర్వహణ, ఎస్టీపీల పని తీరు, బయోగ్యాస్ ప్లాంట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ ప్రగతి బాగుందని, ఆదిలాబాద్ పట్టణంలో అమలుతీరు సాధ్యాసాధ్యాలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ పేర్కొన్నారు.

ఉపాధి సిబ్బందికి రూ.37 వేల జరిమానా


ప్రజావేదికలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో సాయన్న

నార్నూర్(గాదిగూడ), న్యూస్‌టుడే : గాదిగూడ మండలంలో శుక్రవారం నిర్వహించిన ఉపాధి హామీ ప్రజా వేదికలో మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన పనుల్లో క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులకు రూ.37,000 జరిమానా విధించారు. రూ.1,69,46,121 తిరిగి వసూళ్లకు ఆదేశించినట్లు డీఆర్‌డీవో సాయన్న పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ మూడేళ్లుగా మండలంలోని కూలీలకు రూ.4,63,27,957 విలువైన పనులు కల్పించామన్నారు. అదనపు డీఆర్‌డీవో కుటుంబరావు, సహాయ పీడీ కృష్ణారావు, విజిలెన్సు మేనేజరు రాజేశ్వర్, అంబుడ్స్‌మెన్ వీణ, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ విజయానందం, ఎంపీవో సాయి ప్రసాద్, ఎస్ఆర్పీ తిరుపతి, ఏపీవో నితిన్‌పవార్ పాల్గొన్నారు.

కరీంనగర్ ఎమ్మెల్యేకు పరామర్శ


నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న, నాయకులు

ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే : ఇటీవల మాతృవియోగం కలిగిన కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను శుక్రవారం ఆదిలాబాద్ భారాస జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి జోగురామన్న పరామర్శించారు. భారాస నాయకులతో కలిసి కమలాకర్ తల్లి లక్ష్మీనరసమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సంక్షిప్తం

వస్త్ర దుకాణాల్లో రాయితీలపై జాగ్రత్త

ఆదిలాబాద్ అర్బన్: దీపావళి పండగను పురస్కరించుకుని వస్త్ర దుకాణాలు ప్రకటించిన రాయితీలపై వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలని వినియోగదారుల హక్కుల సంస్థ జిల్లా అధ్యక్షుడు దొమ్మాటి కిరణ్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలో సమావేశంలో మాట్లాడారు. పండగ సందర్భంగా రాయితీల పేరుతో మోసం చేసే అవకాశముందన్నారు. మిఠాయిలు, ఇతర వస్తువులు కొనే ముందు వివరాలను సరిచూసుకోవాలని కోరారు.

నిధులు మంజూరు చేయించినందుకు సన్మానం

ఆదిలాబాద్ అర్బన్: ఆదిలాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి సీఆర్ఆర్ గ్రాంటు రూ.10కోట్లు, ఎస్డీఎఫ్ కింద రూ.4కోట్లు మంజూరు చేయించినందుకు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, నాయకులు నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాసరెడ్డిని సన్మానించారు. కౌన్సిలర్లు జహీర్ రంజానీ, శ్రీనివాస్, సతీష్, నర్సింగ్, లక్ష్మణ్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, రామ్‌కుమార్, భూమన్న, ఇమ్రాన్ తదితరులున్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

నార్నూర్(గాదిగూడ): మహిళా సాధికారతకు ప్రభుత్వం కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని డీఆర్‌డీవో సాయన్న అన్నారు. శుక్రవారం గాదిగూడలో స్వయం సహాయక సంఘ మహిళలకు రాయితీపై కుట్టు మిషన్లు పంపిణీ చేసి శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మహిళా సమాఖ్య ఏపీఎం మాధవి, ఏడీఆర్‌డీవో కుటుంబరావు, ఏపీడీ కృష్ణారావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ముగిసిన ఏనుగు పండగ

బేల: ఏనుగ పండగ వేడుకలు శుక్రవారం వైభవంగా ముగిశాయి. రెండు రోజుల పాటు భక్తులు ఉపవాసాలు ఉండి పూజలు నిర్వహించారు. మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న మరాఠీ గ్రామాల్లో ఈ వేడుకలను భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. అనంతరం వాగుల్లో నిమజ్జనం చేశారు.

అథ్లెటిక్స్‌లో విద్యార్థి ప్రతిభ

బేల: బేల కీర్తన డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి జస్వంత్ ఇటీవల వరంగల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని రజత పతకం సాధించాడు. శుక్రవారం కళాశాల ప్రిన్సిపల్ డా.వరప్రసాద్, క్రీడల ఇన్‌ఛార్జి సాగర్, అధ్యాపకులు అతడిని అభినందించారు.

పాఠశాలల సందర్శన

బజార్‌హత్నూర్: బజార్‌హత్నూర్ మండలం గిర్నూర్ ప్రాథమిక పాఠశాల, బజార్‌హత్నూర్ కేజీబీవీ పాఠశాలలను డీఈఓ ప్రణీత ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు.

వారణాసి నుంచి శబరి పాదయాత్ర

ఇచ్చోడ: బెంగళూరుకు చెందిన అయ్యప్ప మాలధారులు కాశీ నుంచి శబరిమల అయ్యప్ప స్వామి ఆలయానికి పాదయాత్రకు బయలుదేరారు. శుక్రవారం ఇచ్చోడలోని మహేందర్ నివాసంలో బస చేయనున్నట్లు తెలిపారు.

సుంకిడి పాఠశాల భవన నిర్మాణానికి కృషి

తలమడుగు: సుంకిడి జిల్లా పరిషత్తు సెకండరీ పాఠశాల పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది. విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువుకుంటున్న విషయాన్ని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ దృష్టికి గ్రామస్థులు దృష్టికి తీసుకెళ్లడంతో శుక్రవారం ఆయన పాఠశాలను సందర్శించారు. నిధులు మంజూరు చేసి అదనపు గదులతో భవన నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తానని భరోసానిచ్చారు. భారాస నేతలు వెంకటేష్, అభిరామ్, కిరణ్, అబ్దుల్లా, ప్రకాశ్, ప్రసూన్‌రెడ్డి, పోచ్చన్న, ఆశన్నయాదవ్‌పాల్గొన్నారు.

కొలాం గిరిజనులకు కొత్త పాఠశాల

బేల: మండలంలోని దేవాపూర్, కొత్త బెంద్రీగూడ అనుబంధ గ్రామాలకు ఐటీడీఏ అధికారులు కొత్త గిరిజన పాఠశాలను ఏర్పాటు చేశారు. కొలాం గిరిజన విద్యార్థులు విద్యకు దూరం కావద్దనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన పాఠశాలను శుక్రవారం ఎంఈఓ కోల నర్సింహులు ఎస్ఆర్పీ శంకర్‌తో కలిసి సందర్శించారు. విద్యార్థులకు దుస్తులు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్నం భోజనం అమలు కావాలంటే యూడైస్‌ప్లస్‌లో నమోదు చేయాల్సి ఉందని, పాఠశాలల వివరాలను డీఈఓకు నివేదిస్తానని ఆయన తెలిపారు.

కుట్రలు పన్నినా.. కేటీఆర్ సభ విజయవంతం

ఆదిలాబాద్ పట్టణం: రైతుల కోసం ఆదిలాబాద్‌లో నిర్వహించిన కేటీఆర్ సభను కాంగ్రెస్ భాజపాలు నిర్వీర్యం చేయాలని ఎన్ని కుట్రలు పన్నినా సభ విజయవంతమైందని భారాస జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగురామన్న తెలిపారు. స్వచ్ఛందంగా వచ్చిన రైతులు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వివరించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణ అధ్యక్షుడు అజయ్, నాయకులు రౌతు మనోహర్, విజ్జగిరి నారాయణ, మెట్టుప్రహ్లాద్, యాసంనర్సింగ్‌రావు, మార్‌శెట్టి గోవర్ధన్, రోకండ్ల రమేష్ పాల్గొన్నారు.

కేటీఆర్ రైతు సంక్షేమం గురించి మాట్లాడటం హాస్యాస్పదం

ఎదులాపురం: భారాస ప్రభుత్వం పదేళ్లు రైతుల గురించి పట్టించుకోక పోగా ప్రస్తుతం అధికారం కోల్పోయాక కేటీఆర్ రైతుల సంక్షేమం గురించి మాట్లాడటం హాస్యాస్పదమని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి విమర్శించారు.

అట్రాసిటీ కేసులపై సమీక్ష

పాలనాప్రాంగణం: జిల్లా విజిలెన్సు అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్ రాజర్షిషా పత్తి కొనుగోళ్ల ఆందోళన నేపథ్యంలో మార్కెట్‌యార్డులో ఉండటంతో జిల్లా ఎస్పీ గౌష్ ఆలం, అదనపు పాలనాధికారి శ్యామలదేవి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఉట్నూరు సబ్‌కలెక్టర్ యువరాజ్ మర్మాట్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

28న జోనల్‌స్థాయి ఈత పోటీలు

ఆదిలాబాద్ క్రీడావిభాగం: ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో ఈ నెల 28న అండర్-14, 17 ఏళ్ల విభాగం బాలబాలికల జోనల్ స్థాయి(ఉమ్మడి జిల్లా) ఈత పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్.కాంతారావు తెలిపారు. అర్హులైనవారు ఉదయం 9 గంటలకు పోటీల కన్వీనర్ రాష్ట్రపాల్‌కు రిపోర్టు చేయాలని, వివరాలకు చరవాణి 77020 35200 నెంబరును సంప్రదించాలని సూచించారు.

పల్లె ప్రజల జీవనం బాగుంది

తాంసి: సివిల్ సర్వీసెస్ శిక్షణ అధికారులు శుక్రవారం పొన్నారి గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్థులు వారిని సన్మానించి, వీడ్కోలు తెలిపారు. పల్లె ప్రజల జీవనం బాగుందని వారు కితాబిచ్చారు. ఎంపీడీవో మోహన్‌రెడ్డి, తహసీల్దార్ లక్ష్మి, కార్యదర్శి గంగన్న, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు రేఖ, మాజీ సర్పంచి అశోక్, నాయకులు లింగారెడ్డి, రఘు, గడుగు గంగన్న, ఆనంద్, అంగన్‌వాడీ కార్యకర్తలున్నారు.

బేల: మండలంలోని సిర్సన్నలో నాలుగురోజుల శిక్షణలో భాగంగా వచ్చిన కేంద్ర సర్వీసుల యువ అధికారుల అధ్యయనం శుక్రవారం ముగిసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుతీరుపై ఆరా తీశారు. చివరి రోజు శిక్షణ అధికారులు నమ్రత, రవికుమార్, సోనియా, శివం, పవితను వీడీసీ సభ్యులు, గ్రామస్థులు సన్మానించారు.

ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ఎదులాపురం: ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు జగన్‌సింగ్, జిల్లా అధ్యక్షుడు దళిత్‌సింగ్ డిమాండ్ చేశారు. వచ్చే నెల 5న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమ గోడప్రతులను ఆవిష్కరించారు. నితిన్, సురేష్, ఇర్ఫాన్, సాయి, షేక్ రఫీక్, పి.రాములు తదితరులు పాల్గొన్నారు.

జిమ్ ప్రారంభం

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లిలో మడావి రజని అనే యువకుడు ఏర్పాటు చేసిన జిమ్‌ను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ప్రారంభించారు. ఆయనతో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎంపీ నగేష్ రాజీనామా చేయాలని డిమాండ్

బోథ్: ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ తన పార్లమెంటు సభ్యత్వానికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాజుయాదవ్ శుక్రవారం డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ పత్తికి, గుజరాత్ పత్తికి ధరలో వ్యత్యాసం ఎందుకని అన్నారు.

ఆహార భద్రత అధికారుల తీరు సరికాదు

ఎదులాపురం: ఆహార భద్రత టాస్క్‌ఫోర్సు అధికారులు చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి తప్ప పదార్థాలు నాణ్యతగా లేవంటూ ఫినాయిల్ పోసి వాటిని నాశనం చేయటం సరికాదని వాణిజ్య, వర్తక వ్యాపార సంఘం ప్రధాన కార్యదర్శి గంద్రత్ సంతోష్ అన్నారు. శుక్రవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు.

సోయా కొనుగోళ్లు తాత్కాలికంగా నిలిపివేత

తాంసి: తాంసి వ్యవసాయ ఉప మార్కెట్ యార్డులో తాంసి, భీంపూర్, తలమడుగు రైతుల సోయా నిల్వలు ఎక్కువకావడంతో 26 నుంచి 27 వరకు తాత్కాలికంగా కొనుగోళ్లు నిలిపివేసినట్లు సీఈఓ కేశవ్ శుక్రవారం తెలిపారు.

విద్యుత్తు ఏఈలకు సన్మానం

భీంపూర్: విద్యుత్తుశాఖ ఏఈలు శ్రావణ్‌కుమార్, తిరుపతిరెడ్డిలను సిబ్బంది నిపాని ఉపకేంద్రంలో శుక్రవారం సన్మానించారు. ఏఈ శ్రావణ్‌కుమార్ బదిలీ కాగా.. కొత్త ఏఈగా తిరుపతిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. వారిద్దరితో పాటు బదిలీ అయిన సబ్ ఇంజినీరు సాయితేజ, లైన్ ఇన్‌స్పెక్టర్లు వసంత్, షౌకత్‌లను సన్మానించి వారి సేవలను గుర్తుచేసుకున్నారు. అర్లి-టి, నిపాని ఉపకేంద్రాల లైన్‌మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్కేపీలో ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు, వ్యాయామ ఉపాధ్యాయులు

అండర్-19 ఫుట్‌బాల్ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే: అండర్-19 ఉమ్మడి జిల్లా స్థాయి ఫుట్‌బాల్ బాలుర జట్టు ఎంపిక పోటీలను శుక్రవారం రామకృష్ణాపూర్ ఠాగూర్ మైదానంలో నిర్వహించారు. కళాశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటిన బాలుర జట్టును ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ అండర్-19 సెక్రటరీ బాబురావు తెలిపారు వచ్చే నెల మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, పీడీ రాజయ్య, శిక్షకుడు రవికుమార్, పీఈటీ సురేందర్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్..



ఎంపికైన విద్యార్థినితో ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి

తాండూరు: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు తాండూరు మండలం అచ్చలాపూర్ గ్రామానికి చెందిన ఎం.అమూల్య ఎంపికైంది. అండర్-17 బాలికల వాలీబాల్ టోర్నమెంట్‌లో సత్తా చాటింది. అచ్చలాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో అమూల్య 8వ తరగతి చదువుతుంది. ఈ నెల 28వ తేదీ నుంచి 30 వరకు గోదావరిఖనిలో నిర్వహించే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున ఆడనుంది. విద్యార్థినిని ప్రధానోపాధ్యాయురాలు బి.ఉమాదేవి, పీడీ సాంబమూర్తి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఫణిరాజా అభినందించారు.

మంచిర్యాల క్రీడావిభాగం: మహబూబ్‌నగర్ జిల్లాలో త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు రేణి రాజయ్య తెలిపారు. జిల్లాలో జరిగిన అండర్-19 బాలుర జోనల్‌స్థాయి పోటీల్లో కార్తీక్, వాగయ్య, ప్రణయ్ ప్రతిభ చాటి అర్హత సాధించారని చెప్పారు. రాష్ట్రస్థాయిలోనూ సత్తాచాటేందుకు మరింత కసరత్తుకు సిద్ధమవుతున్నారని, జాతీయ స్థాయి పోటీలే లక్ష్యంగా సాధన చేయిస్తున్నట్లు పేర్కొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో పీడీ రాజయ్య

హాకీ పోటీలు ప్రారంభం

ఉట్నూరు: ఉట్నూరులోని కుమురం భీం మైదానంలో శుక్రవారం ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ హాకీ పోటీలను ఐటీడీఏ డీడీ వసంత్‌రావు ప్రారంభించారు. గిరిజన విద్యార్థులు హాకీ క్రీడలో రాణించడం హర్షణీయమన్నారు. గిరిజన సంక్షేమశాఖ క్రీడాధికారులు పార్థసారథి, భుక్య రమేష్, హెచ్‌ఎం రాఠోడ్ ఉత్తం, ఏఎస్‌వో హేమంత్, పవార్ లక్ష్మణ్, కోచ్‌లు రవీందర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆపన్నహస్తం.. మానవత్వపు నేస్తం



మళ్లీ..జీవాలను మేతకు తీసుకెళ్తున్న ఐనేష్

జీవితంపై పిడుగు దాతల గొడుగు..

నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం రాంసింగ్ తండాకు చెందిన దివ్యాంగుడైన ఐవాన్ ఐనేష్‌కు గొర్రెల మందే జీవనాధారం. ఎప్పటి లాగే వాటిని మేతకు తీసికెళ్లగా ఆకస్మికంగా పిడుగుపడి 70 జీవాలు మృత్యువాత పడ్డాయి. రోజూ వాటిని మేపుతుండే వెళ్లే ఆ వ్యక్తికి తెల్లవారే పని లేకుండా పోయింది. దాదాపు రూ.10లక్షల వరకు నష్టం వాటిల్లింది. ఏం చేయాలో తెలియని దైన్యం. ఈ స్థితిలో సమీప తండాల్లోని మానవతామూర్తులు కదిలివచ్చారు. తలా ఓ జీవి రెండు జీవాలను ఐనేష్‌కు ఇచ్చారు. పిడుగు పడి అతలాకుతలమైన ఆ బడుగు జీవిపై గొడుగు పట్టారు. 40 జీవాలను అందించి మళ్లీ ఆయనకు బతుకు దారి చూపించారు. ఒకరి కష్టాన్ని పది మంది పంచుకుంటే సమస్య ఎంత తేలికవుతుందో నిరూపించారు ఆ మంచి మను(సు)షులు.

సహజంగా ప్రతి మనిషికీ ఏవో కష్టాలు వస్తూనే ఉంటాయి. వాటిని ఎదురొడ్డిన పరిస్థితుల్లో ఉన్న వారు అల్లాడుతుంటారు. అయ్యో నాకు ఇలా అయ్యిందేంటీ అని బాధపడుతుంటారు. దేవుడా నన్ను గట్టెక్కించు అని వేడుకుంటారు. ఇలాంటి సందర్భాల్లో ఎవరైనా చేయూతనిస్తేనో.. చేతనైనంత సాయం చేస్తేనో ఊరట పొందుతారు. తాను కొలిచే దైవమే సాక్షాత్తు కళ్ల ముందుకు వచ్చిందని ఆ మనిషిలో దేవుణ్ని చూస్తారు. మానవత్వం పరిమళించి తోటి వారి ఇబ్బందుల్లో పాలుపంచుకుంటే వారు ఎదుటి వారి గుండెల్లో గూడు కట్టుకుంటారు.

-న్యూస్‌టుడే, మామడ

ఎదుటి మనిషి కన్నీరు తుడవడానికి బంధుత్వమో, రక్త సంబంధమో, పేగు బంధమో ఉండక్కర్లేదు. పిడికెడు గుండెలో చిటికెడు మానవత్వం ఉంటే చాలు

ఆకలిగా ఉన్న వారికి గుప్పెడు అన్నం, ఆపదలో ఉన్న వారికి కొంచెం సాయం, బాధలో ఉన్న వారికి ఓదార్పు అందించడం నిజమైన మానవత్వం.

ఎన్ని మతాలున్నా అసలైన మతం మానవత్వం

ధన రాసులే ఉండక్కర్లేదు..

మానవత్వానికి కొలమానం డబ్బు మాత్రమే కాదు. ధనం దానం చేసేనే మేలు చేసినట్లు కాదు. ఎన్నో రకాలుగా మంచి చేయవచ్చు. ఒక్కసారి మనం చేసే మాట సాయమే కొందరి జీవితాల్లో వెలుగులు నింపుతాయి. కింద పడిపోతున్న ఓ వ్యక్తిని పట్టుకోగలిగినా.. ప్రవాహంలో కొట్టుకుపోతున్న మనిషిని ఒడ్డుకు చేర్చగలిగినా, కారుమబ్బులు అలుముకున్న జీవితాల్లో వెలుగులు ప్రసరింప చేసే ఏ కార్యం చేసినా కాంతిమూర్తులవుతారు.

అభినందనీయం అభిమన్యు బృందం..

ఉట్నూరు ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల వేదికగా ఏర్పాటైన 'అభిమన్యు వాట్సప్ గ్రూప్' ఎన్నో సందర్భాల్లో ఆపదలో ఉన్న, అత్యవసరమైన వారికి అండగా నిలుస్తూ మానవత్వపు పరిమళాలు వెదజల్లుతోంది. దాదాపు పదేళ్ల క్రితం గాదిగూడ మండలం లోకారికి చెందిన శేఖరబాబు ప్రారంభించిన ఈ గ్రూపులో 800 మంది సభ్యులున్నారు. వీరంతా కలిసి ఇప్పటి వరకు విద్య, వైద్యం, ఇతర అవసరాల కోసం రూ.లక్షల్లో సాయం చేశారు. అభ్యది మానవసేవ మాధవ సేవ గ్రూపు సైతం సేవల్లో ముందుంటోంది.



చదువులో ప్రతిభ కనబరిచిన విద్యార్థికి సాయమందించి సన్మానిస్తూ..

వాట్సప్ గ్రూపులు..


సామాజిక మాధ్యమాలు విస్తృతమయ్యాక సాయం మరింత ఆలోచన ఉన్న చేతుల ఒక్కటవుతున్నాయి. ముఖ్యంగా వాట్సప్ గ్రూపుల ద్వారా ఆపన్న హస్తం అందించే వారు బయటకొస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని పట్టణాల్లో 'రక్తదాత' గ్రూపులు చేస్తున్న సేవలు ప్రత్యేకించి చెప్పాల్సింది. నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్‌లో కనీసం రోజుకు 20 మందికి పైగానే వాట్సప్ గ్రూపుల్లో చూసి అవసరమున్న వ్యక్తులకు అత్యవసరంగా వెళ్లి రక్తదానం చేస్తున్నారు.

బ్యాచ్‌మేట్లు..క్లాస్‌మేట్లు

ఆదుకునేందుకు రక్త సంబంధీకులు, బంధువులే కానక్కర్లేదని పరిచయస్తులు, మిత్రులైనా మేలు చేయొచ్చని నిరూపిస్తున్నారు చాలా మంది. కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు, ఒకేసారి కొలువు దక్కి ఒక చోట శిక్షణ పొందిన వారు ఎప్పటికీ కలిసుంటున్నారు. ఎవరికి ఏ కష్టమొచ్చినా మేమున్నామంటూ అండగా నిలుస్తున్నారు.

రూ.కోటి సాయం చేసి..

2014 సంవత్సరంలో ఎస్సైలుగా ఎంపికై ఇప్పుడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న వారు ఓ సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. తమ బ్యాచ్‌మేట్ల కష్టాలను పంచుకునేందుకు వారు చూపిస్తున్న మానవత్వం స్ఫూర్తిదాయకం. ప్రమాదాల్లో, ఇతర ఆరోగ్య సమస్యలతో మరణించిన తమ సహచరుల కుటుంబాలకు ఇప్పటి వరకు రూ.కోటి వరకు సాయం చేశారంటే మాటలు కాదు. మేమంతా ఏడాదికి రూ.3 వేల సంక్షేమ సంఘానికి అందిస్తామని, అత్యవసరమైతే ఎక్కువ డబ్బులు తలా కొంత ఇస్తామని ఆ బ్యాచ్‌కు చెందిన లోకేశ్వరం ఎస్సై అశోక్ తెలిపారు.



మరణించిన బ్యాచ్‌మేట్ కుటుంబానికి సాయమందిస్తూ..

మేమున్నామంటూ..

లక్ష్మణచాంద మండలం వడ్యాల్‌లో 1997-98 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు తమ మిత్రుల కష్టాల్లో పాలుపంచుకుంటున్నారు. మరణించిన ముగ్గురు క్లాస్‌మేట్ల కుటుంబాలకు రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న మరో ఇద్దరు స్నేహితుల వైద్యం కోసం రూ.45 వేలు అందించారు. ఇలా ఎవరికి ఏ ఇబ్బంది ఉన్నా అండగా నిలుస్తున్నారు.



మిత్రుని కుటుంబానికి ఆసరానిస్తూ..

బకాయిలు రాక.. భవనానికి తాళం



కాలక్షేప మండపానికి తాళం వేసిన గుత్తేదారు

బెల్లంపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: బెల్లంపల్లి మండలం కన్నాలలోని శ్రీబుగ్గరాజరాజేశ్వర స్వామి ఆలయప్రాంగణంలో నిర్మించిన కాలక్షేప మండపానికి గుత్తేదారు తాళం వేశారు. భక్తుల సౌకర్యం కోసం సుమారుగా రూ. 50 లక్షలు వెచ్చించి నిర్మించారు. పనులు పూయి రెండేళ్లు అవుతున్నా ఇంకా దేవాదాయ శాఖకు సదరు గుత్తేదారు అప్పగించనట్లు సమాచారం. క్యూసీ పనులు కాకపోవడంతో ఇంకా పూర్తిస్థాయిలో నిధులు విడుదల కాలేదు. అనధికారికంగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంతో పగుళ్లు వస్తున్నట్లు, అధికారులు పరిశీలనకు వస్తే రావాల్సిన డబ్బుల్లో కోత పడుతుందని తాళం వేసినట్లు తెలిసింది.

ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ ఏర్పాటు



నస్పూర్‌లో ఏర్పాటు చేసిన ల్యాబ్ కార్యాలయం

మంచిర్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: ఆత్మహత్యలు, హత్యలు, దొంగతనాల వంటి నేరాలలో విశ్వసనీయంగా నేర పరిశోధన జరిపే ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ మంచిర్యాలలో ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు మంచిర్యాలతో పాటు ఖమ్మంలో ఈ ల్యాబ్‌లను ప్రారంభించినట్లు ఉత్తర్వులు జారీ చేశారు. హత్య, హత్యాచారం, దోపిడీ కేసుల్లో అనుమానాస్పద పరిస్థితుల్లో మరణం సంభవించిన మరణాల కారణం తెలుసుకోవడం కోసం వైద్యులు మృతుల రక్తం, ఇతర శరీర భాగాలను పరీక్షించి కరీంనగర్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించేవారు. ఇకపై మంచిర్యాల, కుమురంభీం జిల్లాలకు సంబంధించిన కేసులతో పాటు పెద్దపల్లి జిల్లాలోని రామగుండం సబ్‌డివిజన్ కేసులు సైతం మంచిర్యాలలోని ల్యాబ్‌లోనే పరీక్షించనున్నారు. దీంతో కేసు పురోగతిలో వేగవంతం కానున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

గుస్సాడీకి జీవం పోసిన కనకరాజు

ఈనాడు, ఆసిఫాబాద్, న్యూస్‌టుడే, జైనూర్: రాజ్‌గోండ్‌ల ప్రాచీన విశిష్ట కళ గుస్సాడీ నృత్యం. తలపై నెమలి ఈకలతో అల్లిన టోపి, చేతిలో దండారి, కాళ్లకు గజ్జలు, జంతువుల చర్మంతో చేసిన వస్త్రాలతో పురి విప్పిన నెమలిలా కనకరాజు గుస్సాడీ నృత్యం చేస్తే చూసేందుకు రెండుకళ్లూ చాలవు. ఇందులో ప్రావీణ్యం సంపాదించిన ఆయన ఆదివాసీల నృత్యకళకు జీవం పోశారు. దేవతామూర్తులను ఆరాధించే దండారీ నుంచే స్ఫూర్తి పొంది గుస్సాడీని నేర్చుకున్నానని పలు సందర్భాల్లో పేర్కొన్నారు. చుట్టు పక్కల పరిసరాల గిరిజనులు ఈయనను ఆదినుంచి కనకరాజుగా కాకుండా గుస్సాడీ రాజుగానే పిలిచేవారు. ఆయన మృతితో ఆదివాసులు శోకసంద్రంలో మునిగారు

ఇందిరాగాంధీ ముందు ప్రదర్శన




గుస్సాడీ కళాకారులకు శిక్షణ ఇస్తున్న కనకరాజు

1982లో దేశరాజధాని దిల్లీలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ముందు ప్రదర్శన ఇచ్చారు. అప్పటి ఆదివాసీ, ఉట్నూరు ఐఏయస్ అధికారి తుకారం సిర్పూరు మండలంలోని పిట్టగూడ గ్రామంలో దండారీ (గుస్సాడీ) ఉత్సవాల్లో నైపుణ్యంలో వీరికి శిక్షణ ఇప్పించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన కనకరాజుతోపాటు సార్మెడీ మెస్రం దుర్గారావును దిల్లీకి పంపించారు. కనకరాజు నృత్యాన్ని చూసి ఇందిరాగాంధీ ముగ్ధురాలుకాగా, ఆమె కాలికి కనకరాజు గజ్జెలు కట్టడంతో ప్రధాని సైతం వీరితో పాదం కలిపారు. 2002లో అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం ముందు చేసిన గుస్సాడీ నృత్యానికి ఆయనను అభినందించారు. ఇప్పటి వరకు 350 పైగా ప్రదర్శనలు ఇచ్చారు. వందలాది మంది ఉత్సాహవంతులైన గిరిజనులకు ఈ నృత్యంలో తర్ఫీదునందించారు. తెలంగాణ నుంచి పద్మశ్రీ పురస్కారం పొందిన తొలి ఆదివాసీ కళాకారునిగా చరిత్రకెక్కారు. కనకరాజుకు ఇద్దరు భార్యలు ఉండగా, నలుగురు కొడుకులు, ఏడుగురు కూతుళ్లు ఉన్నారు.



మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నుంచి పద్మశ్రీ అవార్డు అందుకుంటున్న కనకరాజు

పోరాటయోధుడు కుమురం భీం మరణం తరువాత నిజాం మానవ పరిణామ శాస్త్రవేత్త హేమన్‌డార్ఫ్‌ను గిరిజనుల స్థితిగతులు తెలుసుకోవడానికి జిల్లాకు పంపించారు. హేమన్‌డార్ఫ్ కొన్ని సంవత్సరాలపాటు మర్లవాయిలోనే ఉన్నారు. ఆదివాసీలతో మమేకమై వారి జీవన విధానం, కావాల్సిన మౌలిక సౌకర్యాలను అధ్యయనం చేశారు. ఈ సమయంలో కనకరాజు ఈయనతోనే ఎక్కువ సమయం గడిపేవారు. బాలుడి నుంచి యువకుడి వరకు హేమన్‌డార్ఫ్‌తో కలిసి ఉన్నానని పలు సందర్భాల్లో తెలిపారు.



ఇందిరాగాంధీ పక్కన (ఎడమ నుంచి మొదటి వ్యక్తి) కనకరాజు

ఎమ్మెల్యే శంకర్‌కు తప్పిన ప్రమాదం



పగిలిన వాహన అద్దాలు

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : ఎమ్మెల్యే పాయల్ శంకర్ త్రుటిలో ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. మూసీ బాధితులకు అండగా భాజపా హైదరాబాద్‌లో శుక్రవారం చేపట్టిన ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆదిలాబాద్‌లో రైతులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకుని హుటాహుటిన బయలుదేరారు. మార్గమధ్యలో కామారెడ్డి జిల్లా బాన్సువాడ ఎక్స్‌రోడ్డు సమీపంలో వెనుక నుంచి వచ్చిన లారీ ఎమ్మెల్యే వాహనాన్ని ఢీకొట్టింది. వెనక అద్దాలు పగిలాయి. ఆ సమయంలో ఎమ్మెల్యేతో పాటు పీఏ మనోజ్‌పవార్, డ్రైవర్ నవీన్ ముగ్గురే పయనిస్తున్నారు. వెనుక సీటులో కూర్చున్న మనోజ్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. రెండు వాహనాల వేగం తక్కువగా ఉండటంతో అంతా సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాద విషయం తెలిసి ఎమ్మెల్యే బంధువులు, అభిమానులు అంతా హైరానా చెందారు. ఎమ్మెల్యే తనకేం కాలేదని వీడియో సందేశం విడుదల చేయడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. రాత్రి ఆదిలాబాద్‌కు చేరుకున్న ఎమ్మెల్యే నేరుగా మార్కెట్‌యార్డుకు చేరుకుని పాలనాధికారి రాజర్షిషా సమక్షంలో వ్యాపారులు, రైతులతో జరిగిన చర్చల్లో పాల్గొన్నారు.

28న పీఎఫ్ మీ ముంగిట

చైతన్యపురి, న్యూస్‌టుడే : కరీంనగర్ భవిష్యనిధి ప్రాంతీయ కార్యాలయం పరిధిలో ఈనెల 28న పీఎఫ్ మీ ముంగిట (నిధి ఆప్కే నికత్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ సెల్వత్కర్ తానయ్య శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులకు అవగాహన కల్పించి, భవిష్యనిధి సమస్యలను పరిష్కరించనున్నట్లు చెప్పారు.

జిల్లా	కార్యక్రమం జరిగే ప్రదేశం
ఆదిలాబాద్:	నలంద డిగ్రీ కళాశాల సమావేశ గది
మంచిర్యాల:	కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్
కుమురంభీం:	సిర్పూర్ కాగజ్‌నగర్ శ్రీకృష్ణవేణి హైస్కూల్
నిర్మల్ :	ఇబ్రహీంబాగ్ రవి ఉన్నత పాఠశాల

ఇంతి.. సింగరేణి కాంతి

● 16 రకాల పనులు ఎంచుకునే అవకాశం..

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: పురుషాధిక్యం ఉన్న సింగరేణిలో మహిళా ఉద్యోగులకు తమ ఉనికిని చాటుకునేందుకు అవకాశం లభించింది. సంస్థలో కారుణ్య నియామకాలు మొదలైన తర్వాత ఉద్యోగాల్లో చేరుతున్న మహిళల సంఖ్య పెరుగుతోంది. వీరిలో ఉన్నత విద్య అభ్యసించిన వారు చాలా మంది ఉన్నారు. వీరందరూ సాధారణ ఉద్యోగులు(జనరల్ మజ్దూర్)గా తమ సేవలు అందిస్తున్నారు. భూగర్భ గనుల్లో వీరు విధులు నిర్వర్తించేందుకు అవకాశం లేకపోవడంతో వీరి సేవలు సంస్థ కార్యాలయాల్లోనే వినియోగించుకుంటున్నారు. సంస్థలో ప్రస్తుతం మహిళా ఉద్యోగుల సంఖ్య పెరుగుతుండటంతో వీరిని ఉపరితలంలోనే 16 రకాల సేవలు వినియోగించుకోవాలని యాజమాన్యం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. కార్పొరేట్, ఏరియా స్థాయిల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కమిటీ విద్యార్హత ఆధారంగా ఉద్యోగినులు ఎంచుకున్న పనులపై శిక్షణ ఇవ్వనుంది.

ఉత్తమ నైపుణ్యాలు ప్రదర్శించేందుకు..



కాసిపేట గనిపై కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

కన్వేయర్ ఆపరేటర్, పంపు ఆపరేటర్, వాల్వ్ ఆపరేటర్, చార్జర్ సేఫ్టీ ల్యాంప్, ల్యాంప్ రూం పిట్టర్, కుక్, వెండార్, సర్వే మజ్దూర్, స్టోర్స్ ఇష్యూ మజ్దూర్, బైండర్, శాంప్లింగ్ మజ్దూర్, ఈపీ గ్రీసర్, ఎక్స్‌ప్లోజివ్ క్యారియర్ వంటి ముఖ్యమైన పనులు ఉన్నాయి. వీటిలో వారు ఉత్తమ నైపుణ్యాలు ప్రదర్శిస్తే మంచి గుర్తింపు లభిస్తుంది. ఉద్యోగినులు ఎంచుకున్న పనులపై శిక్షణ ఇచ్చి తర్వాత ఆయా పనులు కేటాయిస్తుంది. ఆయా కేటగిరీల్లో అంతర్గత పరీక్షలు రాసి ఉన్నత స్థితికి చేరుకునే అవకాశముంది. ఉన్నత విద్య అభ్యసించి కార్యాలయాల్లో అటెండర్లుగా పని చేసిన వారు ఇకపై సాంకేతిక పరమైన పనుల్లో ప్రతిభ చాటుకునేందుకు వీలు ఏర్పడింది.


కాసిపేట: కాసిపేట గనిలో మహిళా ఉద్యోగులకు ఖాళీగా ఉన్న వివిధ శాఖల ఉద్యోగాలకు శిక్షణ అనంతరం ఉద్యోగం కల్పిస్తామని ఎస్‌వోటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిపై ఖాళీగా ఉన్న 16 ఉద్యోగాల కోసం మహిళా ఉద్యోగులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎంచుకున్న ఉద్యోగానికి ముందుగా ఉద్యోగులకు శిక్షణ ఇస్తామన్నారు. పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డీజీఎంఐఈడీ రాజన్న, వైద్యురాలు భవాని, రామదాసు, భూశంకరయ్య ఉన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్‌గా దివ్య



శ్రీరాంపూర్ ఏరియాలోని కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌లో జనరల్ మజ్దూర్ ఉద్యోగిని బి.దివ్య కంప్యూటర్ ఆపరేటర్‌గా సేవలు అందిస్తున్నారు. 2022లో సంస్థలో చేరిన ఆమె ఎంఎస్‌సీ(మ్యాథమేటిక్స్) పూర్తి చేశారు. విద్యార్హత మేరకు అధికారులు ఆమెకు విధులు కేటాయించారు. కంప్యూటర్ ఆపరేటర్‌గా దివ్య సంస్థకు మెరుగైన సేవలు అందిస్తున్నారు. మహిళా ఉద్యోగులు యాజమాన్యం సూచించిన పనుల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని ఆమె చెబుతున్నారు.

ఫైళ్ల కూర్పులో నేర్పరి



ఏరియాలోని సీహెచ్‌పీలో బదిలీ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న గుడికందుల స్వప్న 2023లో సంస్థలో చేరారు. ఎంబీఏ(హెచ్‌ఆర్‌ఎం) పూర్తి చేసిన ఆమె కార్యాలయంలో చురుకైన పనులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగులు, సంస్థకు చెందిన ఫైళ్లను భద్రపర్చడం, వాటిలో ఏవైనా పెండింగ్ సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. యాజమాన్యం సూచించిన పనుల్లో కార్యాలయ అటెండెంట్ ముఖ్యమైన పనే అని స్వప్న అంటున్నారు.

ఈ సన్నాలకే బోనస్



సాగవుతున్న సన్న రకాలు



నిర్మల్, న్యూస్‌టుడే: సన్నరకం ధాన్యం క్వింటాలుకు ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించింది. ఏ రకం వంగడాలకు బోనస్ వర్తిస్తుందనే సందేహాలు అన్నదాతల్లో నెలకొన్నాయి. ఈక్రమంలో ప్రభుత్వం 33 సన్నరకాలు గుర్తించింది. సన్నరకం గింజ పొడవు 6 మిల్లీమీటర్ల కంటే తక్కువ, మందం 2 మిల్లీమీటర్ల కంటే ఉండాలని ప్రమాణాలు నిర్దేశించింది. ఆ వంగడాలు ఇవే..

సిద్ధి	(డబ్ల్యూజీఎల్-44)
కంపసాగర్-1	(కేపీఎస్-2874)
సాంబమసూరి	(బీపీటీ-5204)
జగిత్యాల-3	(జేజీఎల్27356)
జగిత్యాల-2	(జేజీఎల్285545)
వరంగల్ సాంబ	(డబ్ల్యూజీఎల్-14)
వరంగల్ సన్నాలు	(డబ్ల్యూజీఎల్-32100)
జగిత్యాల మసూరి	(జేజీఎల్-11470)
పొలాస ప్రభ	(జేజీఎల్-384)
కృష్ణ	(ఆర్ఎన్ఆర్-2458)
మానేరు సోనా	(జేజీఎల్-3828)
తెలంగాణ సోనా	(ఆర్ఎన్ఆర్-15048)
వరంగల్ వరి	-1119
కూనారం వరి-1	(కేఎన్ఎం-733)
కూనారం వరి-2	(కేఎన్ఎం-1638)
వరంగల్ వరి-2	(డబ్ల్యూజీఎల్-962)
రాజేంద్రనగర్ వరి-4	(ఆర్ఎన్ఆర్-21278)
జగిత్యాల సన్నాలు	(జేజీఎల్-1798)
జగిత్యాల సాంబ	(జేజీఎల్-3844)
కరీంనగర్ సాంబ	(జేజీఎల్-3855)
అంజన	(జేజీఎల్-11118)
నెల్లూరి మసూరి	(ఎన్ఎల్ఆర్-34449)
ప్రత్యూమ్న	(జేజీఎల్-17004)
సుగంధ సాంబ	(ఆర్ఎన్ఆర్-2354)
శోబిని	(ఆర్ఎన్ఆర్-2354)
సోమనాథ్	(డబ్ల్యూజీఎల్-347)
ఆర్ఎన్ఆర్	-31479 (పీఆర్‌సీ)
కేపీఎస్	-6251 (పీఆర్‌సీ)
జేజీఎల్	-33124(పీఆర్‌సీ)
హెచ్ఎంటీ సోనా	
మారుటేరు సాంబ	(ఎంటీయూ-1224)
మారుటేరి మసూరి	(ఎంజీయూ-1262)
ఎంటీయూ-1271	